SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక



సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565



సంపుటి: 1 | సంచిక: 75 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |




# వైభవంగా గరుడ సేవ

- బ్రహ్మోత్సవాల్లో 5 వ రోజు రాత్రి వేడుక
- లక్షలాది భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు
- గోవింద నామస్మరణతో మార్మోగిన వీధులు
- మాడ వీధుల్లో ఆధ్యాత్మిక సందడి
- కర్పూర హారతులు పట్టిన భక్త జనం
- పాల్గొన్న టీటీడీ ఈవో, జీయర్ స్వాములు
- కోలాటాలు, భజనలతో కనుల పండువ

వివరాలు 3లో..



కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 5 వ రోజైన శనివారం రాత్రి గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు లక్షలాది మంది భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు.

## మోహినీ రూపంలో శ్రీవారు!

..వివరాలు 3లో

# పేదలకు పట్టాభిషేకం

## 4 దశాబ్దాల కల సాకారం!



- విశాఖలో 28445 మంది పేదలకు ఇంటి పట్టాలు
- పంపిణీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి పేదవాడికి సొంతింటి భాగ్యం
- 11 మండలాల్లో 399 ఎకరాల క్రమబద్ధీకరణ
- 22000 మంది పంచగ్రామాల ప్రజల సమస్యకు పరిష్కారం
- కేంద్రం సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ

విశాఖపట్నం (సమయం న్యూస్): విశాఖపట్నం ప్రాంతంలోని 28445 కుటుంబాలు 4 దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముగింపు పలికారు. 'పేదలకు పట్టాభిషేకం ఉ మీ ఇల్లు మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలపై పూర్తి హక్కులు కల్పించే కన్వేయన్స్ డీడ్లను ఆయన పంపిణీ చేశారు. పలువురికి స్వయంగా పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమం కింద విశాఖపట్నంలోని 11 మండలాల్లో 399 ఎకరాల భూమిని ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. 19,33,853 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమికి సంబంధించిన పట్టాల రిజిస్ట్రేషన్ విలువ సుమారు 8874 కోట్లు కాగా, మార్కెట్ విలువ అంతకంటే గణనీయంగా ఉండనుంది. అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కన్వేయన్స్ డీడ్ల పంపిణీ ద్వారా దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న వేలాది పేద కుటుంబాల అనిశ్చితికి ముగింపు పలుకుతున్నామన్నారు. భూముల

మిగతా 2 లో

## అక్టోబర్ 1న కరువు మండలాల ప్రకటన!

- వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

2

## ఆర్కే బీచ్‌లో సాగర స్వచ్ఛత!

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం




# 51 వేల మందికి కేంద్ర కొలువులు

20వ రోజ్‌గార్ మేళాలో నియామక పత్రాలు

45 ప్రాంతాల్లో ఏకకాలంలో కార్యక్రమం

2047 వికసిత భారత్‌లో యువతదే కీలక పాత్ర

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్

వెయ్యి ఐటీఐల ఆధునీకరణకు రూ.60 వేల కోట్లు

ఇప్పటివరకు 12.75 లక్షల మందికి నియామక పత్రాలు

4

## మహిళను కొట్టి చంపి..

ఏడుస్తున్న చిన్నారిని మృతదేహంపై ఉంచిన దారుణం

రాయచూర్ జిల్లాలో సంచలనం సృష్టించిన హత్య ఉదంతం

4





4

## సౌదీకి కొత్త సంకటం!

హౌతీలతో అమెరికా రహస్య చర్చలు..

మస్కట్‌లో అమెరికా-హౌతీ ప్రతినిధుల భేటీ



## ఢిల్లీ వర్సిటీలో ఏబీవీపీ హవా

నాలుగింట మూడు కీలక పదవులు కైవసం

అధ్యక్షుడిగా యశ్ దబాస్.. ఉపాధ్యక్షుడిగా స్వతంత్ర అభ్యర్థి దీపాంశు

.. వివరాలు 4లో



## వీళ్లకు స్టూడెంట్స్ వద్దు.. అంధభక్తులే కావాలి

ప్రశ్నించే విద్యార్థులంటే వ్యవస్థకు భయం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

4

## పింఛను కోసం ఎవ్వరికీ రూపాయి ఇవ్వొద్దు

50 ఏళ్లు నిండిన నేతన్నలకు ఆర్థిక చేయూత

మంత్రి సవిత

దరఖాస్తుల పరిశీలనలో అక్రమార్కులపై వేటు

లంచాలు తీసుకున్న ఇద్దరు అధికారుల సస్పెన్షన్

3



## ఎస్ఆర్ఎంలో సైన్స్ సమ్మేళనం!

- అమరావతి ఎస్ఆర్ఎం వర్సిటీలో జాతీయస్థాయి సదస్సు
- డిసెంబరు 27, 28, 29 తేదీల్లో 3 రోజుల పాటు నిర్వహణ

3



# పేదలకు పట్టాభిషేకం!



(మొదటిపేజీ తరువాయి..)

విలువలు పెరిగాయన్న కారణంతో వాటిని విక్రయించవద్దని లబ్ధిదారులకు సూచించారు. ఈ భూమి వారికి భద్రత, ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తుందని చెప్పారు. పట్టాల పంపిణీ కేవలం ఆస్తి హక్కుల బదలాయింపు మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవానికి, పిల్లల భవిష్యత్తుకు గుర్తింపు అని పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించి, ఇళ్లు నిర్మించి శాశ్వత చిరునామా కల్పిస్తామని తెలిపారు. గత 2 ఏళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించామని, వచ్చే మార్చి నాటికి మరో 5 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

### పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

విశాఖపట్నంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పంచగ్రామాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని చంద్రబాబు తెలిపారు. 22000 మందికి పట్టాలు జారీ చేయాల్సి ఉందని, ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. దేవాదాయ శాఖ భూముల్లో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు కూడా ఇంటి స్థలాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. 'మీ భూమి ఉ మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే వివిధ జిల్లాల్లో 12000 కుటుంబాలకు పట్టాలు అందజేశామని వివరించారు.

### ప్రపంచస్థాయి నగరంగా విశాఖ

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖపట్నం 1 అని ముఖ్యమంత్రి కొనియాడారు. నగరానికి ప్రపంచస్థాయి సిటీగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు కూడా ప్రారంభమయ్యాయని చెప్పారు. ఎల్ నినో ప్రభావంతో తలెత్తిన నీటి సమస్యను తాను సమీక్షించామని, పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తరలించి తాగునీటి అవసరాలకు శాశ్వత



పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో ఎక్కడా నీటి కొరత లేకుండా చూస్తామన్నారు.

### ప్రజా వినియోగంలోకి రుషికొండ భవనాలు

గత ప్రభుత్వ హయాంలో విశాఖ ప్రజలు భూవివాదాలు, కూల్చివేతలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. రుషికొండలో నిర్మించిన భవనాల వినియోగం, నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుని, వాటిని ప్రజా ప్రయోజనాలకు వాడేలా చర్యలు చేపడతామని తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలను ఆకర్షించేందుకు కృషి చేస్తుంటే, కొందరు డేటా సెంటర్ల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కె. అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, డోలా బాలవీరాంజనేయ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ ఎం. భరత్, ఇతర ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.





# బీచ్‌లో సీఎం సందడి!

### మూరి మిక్చర్ రుచి చూసిన చంద్రబాబు
### ఒంటరి మహిళకు తక్షణ పింఛను మంజూరు
### చిరు వ్యాపారితో ఆప్యాయంగా ముచ్చట్లు
### ఆనందంలో ఉక్కిరిబిక్కిరైన పేదరాలు

**విశాఖపట్నం (సమయం న్యూస్):** విశాఖ సాగర తీరంలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసక్తికరంగా సందడి చేశారు. ఆర్కే బీచ్‌లో పర్యటిస్తున్న సమయంలో మూరి మిక్చర్ విక్రయించే 1 మహిళతో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ వ్యాపారం ఎలా సాగుతుందో అడిగి తెలుసుకుని, ఆమె కష్టసుఖాలను సావధానంగా విన్నారు. చిరు వ్యాపారం చేసుకునే ఆమె వద్ద మూరి మిక్చర్ తీసుకుని ముఖ్యమంత్రి స్వయంగా రుచి చూశారు. మాటల మధ్యలో ఆమె 1 ఒంటరి మహిళ అని తెలుసుకుని ఆయన వెంటనే స్పందించారు. తక్షణమే ఆమెకు 1 పింఛను మంజూరు చేయాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి తన వద్దకు వచ్చి మూరి మిక్చర్ తినడమే కాక, తనతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడటం ఆ మహిళను ఉక్కిరిబిక్కిరి చేసింది. దానికి తోడు తన దీనావస్థను విన్న వెంటనే, ఏమాత్రం ఆలోచించకుండా పింఛను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించడంతో ఆ మహిళ సంతోషం పట్టలేకపోయింది. ఊహించని ఈ పరిణామంతో ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు బెంగళూరుకు సీఎం!

### రేపటి నుంచి 2 రోజుల పాటు కుప్పంలో పర్యటన
### 289.5 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం
### హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ వద్ద జలహారతి
### 38.5 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన

**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం బెంగళూరులో పర్యటించనున్నారు. సాయంత్రం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బెంగళూరులోని 'ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి సీఎం నేరుగా చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి చేరుకుంటారు. అక్కడ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. రైతు బజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. మొత్తం 289.5 కోట్ల విలువైన పనులను ప్రారంభించి, 38.5 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేస్తారు. స్వర్ణ కుప్పం విజయాలను ప్రదర్శించే వీడియోను వీక్షించడంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారు. కుప్పం కొత్తపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో



ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అనంతరం 'స్వర్ణ కుప్పం' అచీవ్‌మెంట్స్ గ్యాలరీని సందర్శించి, హిందాల్కో సంస్థ ప్రతినిధులతో సమావేశమవుతారు. జాతీయ రహదారి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారు. ఆ రోజు రాత్రి కుప్పం రైల్వే స్టేషన్‌లో దాదర్–పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు హాల్ట్‌ను ప్రారంభిస్తారు. కుప్పం పర్యటనలో 2 వ రోజైన మంగళవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో చేపట్టిన 9000 కోట్ల విలువైన హెచ్ఏఎం పనులను సీఎం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి చర్చిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పార్టీ కేడర్ మీటింగ్‌లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రానికి తిరిగి అమరావతి చేరుకుంటారు.

# అక్టోబర్ 1 న కరువు మండలాల ప్రకటన!

- వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- 513 మండలాల్లో కరువు ఛాయలు
- ప్రకృతి , సూక్ష్మ సేద్యానికి అత్యధిక ప్రాధాన్యం
- విశాఖలో నీటి కష్టాలు రాకుండా చర్యలు



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి అక్టోబర్ 1 న కరువు మండలాలను ప్రకటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కరువు మండలాలను గుర్తించడంతో పాటు ఎక్కడా పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్రానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావం, వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, తాగునీటి సరఫరా అంశాలపై శనివారం క్యాంపు ఆఫీసులో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

### 513 మండలాల్లో కరువు ఛాయలు..

6 శాఖల నుంచి అందే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని వర్షపాతం, సాగు పరిస్థితి, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, ఉపగ్రహ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు లాంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరువు నెలకొందని చెప్పారు. వీటిలో 268 మండలాల్లో పరిస్థితి తీవ్రంగా, 245 మండలాల్లో మోస్తరుగా ఉందన్నారు. కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుందని చెప్పారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి బృందాలు పంట నష్టం, దిగుబడి నష్టాన్ని పరిశీలిస్తాయని, అనంతరం వ్యవసాయ శాఖ నివేదికను కలెక్టర్లకు సమర్పిస్తుందని చెప్పారు. కరువు ప్రతిపాదనలను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖకు కలెక్టర్లు సమర్పించేందుకు సెప్టెంబర్ 24 వ తేదీని ఆఖరుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలను సెప్టెంబర్ 29 న రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో పరిశీలిస్తారని తెలిపారు.

### ఉద్యాన పంటలపై ఎల్ నినో ప్రభావం..

ఉద్యాన పంటలు కాపాడటానికి ఇప్పటికే 190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సమీక్షలో ముఖ్యమంత్రి అన్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్ నినో ప్రభావాన్ని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1357 ఆర్ ఎస్ కెల పరిధిలో ఉన్న పంటలు హై రిస్క్ కేటగిరీలో ఉన్నాయన్నారు. ఎల్ నినోతో 17916 హెక్టార్లలోని నారింజ, బత్తాయి, మామిడి, ఎర్ర మిరప, ఉల్లి, కూరగాయల పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. నీటి లభ్యత తగ్గుతున్న పరిస్థితుల్లో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు సూక్ష్మ సేద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద రైతులకు సంబంధించిన 4 కీలక సేవలను మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చూడాలని నిర్దేశించారు.

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు..

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తాగునీటికి బోర్లపై ఆధారపడే ప్రాంతాలకు అవసరమైతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించేలా చూడాలన్నారు. విశాఖ తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి విశాఖ నీటి సరఫరా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. విశాఖ సమీపంలోని రిజర్వాయర్లు నింపేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టే అవకాశాలను పరిశీలించాలన్నారు. మేఘాద్రిగడ్డకు పోలవరం ఎల్ ఎం సీ నుంచి ప్యాకేజీ 8 కింద పైపులైన్ ద్వారా నీటిని తరలించే పనుల్లో వేగం పెంచాలన్నారు. విశాఖ నగరానికి మరో 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# ఆర్కే బీచ్‌లో సాగర స్వచ్ఛత!

- స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం
- పెదజాలరిపేటలో ప్లాస్టిక్ రికవరీ సెంటర్ ప్రారంభం
- 1200 టన్నుల వ్యర్థాల తొలగింపే లక్ష్యం
- ఒంటరి మహిళకు పింఛను మంజూరు

**విశాఖపట్నం (సమయం న్యూస్):** విశాఖలో 1 రోజు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్కే బీచ్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగర స్వచ్ఛత కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెదజాలరిపేటలో ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సముద్ర వ్యర్థాలను సేకరించే పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో సీఎం సంభాషించారు. చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో లభించే ప్రోత్సాహంతో తమకు అదనపు ఆదాయం వస్తోందని మత్స్యకారులు ఆయనకు తెలిపారు. అనంతరం సముద్ర ఉపరితలంలో సేకరించిన వ్యర్థాలను డిజిటల్ తూకం వేసే విధానాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ద్వారా లభించే ప్రోత్సాహకాన్ని మత్స్యకారులకు అందజేశారు. సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత వలలు తొలగిస్తున్న విధానాన్ని స్కూబా డైవర్లను అడిగి తెలుసుకున్నారు. సాగర స్వచ్ఛతలో భాగంగా ఏకంగా 1200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.



మ్యాన్‌హోళ్లు, మురుగు కాల్వల శుభ్రత కోసం జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సీవరేజ్ రోబో పనితీరును ప్రదర్శనశాలలో ఆయన పరిశీలించారు. జీవీఎంసీ సాగర స్వచ్ఛత ప్రాజెక్టుకు లభించిన గ్లోబల్ గుర్తింపు, భవిష్యత్తు లక్ష్యాలపై బ్లూమ్‌బెర్గ్ ప్రతినిధులతో చర్చించారు.

ఆర్కే బీచ్‌లో మూరి మిక్చర్ విక్రయించే మహిళ జీవనోపాధి గురించి తెలుసుకున్న సీఎం చంద్రబాబు ఆమె విక్రయించే మూరిమిక్చర్‌ను ఆస్వాదించారు. ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకున్న ముఖ్యమంత్రి, వెంటనే ఆమెకు పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

# వైభవంగా గరుడ సేవ!

- బ్రహ్మోత్సవాల్లో 5 వ రోజు వేడుక
- లక్షలాది భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు
- మార్మోగిన వీధులు
- మాడ వీధుల్లో ఆధ్యాత్మిక సందడి



**తిరుమల (సమయం న్యూస్):** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 5 వ రోజైన శనివారం రాత్రి గరుడ సేవ అత్యంత వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు లక్షలాది మంది భక్తులకు దర్శనమిచ్చి కటాక్షించారు. గజరాజులు ముందు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల దివ్య ప్రబంధ పారాయణంతో, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు భక్తిభావంతో సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవిందా గోవిందా అంటూ స్వామివారిని దర్శించుకున్నారు. 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడ సేవకు అత్యంత విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. గరుడుడు జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీకగా భావించబడతాడు. గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకోవడం సర్వపాప ప్రాయశ్చిత్తానికి, జ్ఞాన వైరాగ్య ప్రాప్తికి దోహదం చేస్తుందని భక్తుల విశ్వాసం. ఈ గరుడ సేవలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ ఎస్ వేంకటేశ్వర్, జేఈవోలు శరత్, ప్రభల గోపీనాథ్, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



# మోహినీ రూపంలో శ్రీవారు!

**బ్రహ్మోత్సవాల్లో 5 వ రోజు ఉదయం పల్లకీ సేవ**

**సర్వాలంకార భూషితుడై కనువిందు చేసిన మలయప్ప**

**మరో తిరుచ్చిపై అభయమిచ్చిన శ్రీకృష్ణుడు**

**తిరుమల (సమయం న్యూస్):** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 5 వ రోజైన శనివారం ఉదయం శ్రీ మలయప్ప స్వామి వారు మోహినీ అవతారంలో సర్వాలంకార భూషితుడై జగన్మోహనాకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై భక్తులకు అభయమిచ్చారు. గజరాజులు ముందుగా నడుస్తుండగా, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి పల్లకీ సేవ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. మోహినీ రూపంలో స్వామివారి దర్శనం జగత్తును ఆవరించిన మాయామోహాన్ని అధిగమించి భగవంతుని శరణు పొందాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. సర్వమూ భగవంతుని లీలావిలాసమేనని, భక్తి మార్గమే మాయామోహాల నుంచి విముక్తికి దారి చూపుతుందని ఈ అలంకారం చాటిచెబుతోంది. పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన గరుడ వాహన సేవకు 108 వైష్ణవ దివ్యదేశాల్లో విశిష్ట స్థానం ఉంది. భగవంతుని వాహనమైన గరుడుని దర్శించడం ద్వారా భక్తిలో శరణాగతి, జ్ఞానం, వైరాగ్యం కలగాలని స్వామివారు అనుగ్రహిస్తున్నారనే విశ్వాసం ఉంది. గరుడుని దర్శనం సర్వపాపాలను హరిస్తుందని, భక్తులకు ఆధ్యాత్మిక శుభఫలాలను ప్రసాదిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ వాహన సేవలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం లో సైన్స్ సమ్మేళనం!

- అమరావతి ఎస్ఆర్ఎం వర్సిటీలో జాతీయస్థాయి సదస్సు
- డిసెంబరు 27, 28, 29 తేదీల్లో 3 రోజుల పాటు నిర్వహణ
- విద్యార్థుల కోసం విజ్ఞాన్ సేతు పేరుతో భారీ సైన్స్ ఎగ్జిబిషన్
- సందర్శించనున్న 10000 మంది పాఠశాలల విద్యార్థులు



**విజయవాడ (సమయం న్యూస్):** జాతీయ స్థాయిలో సైన్స్, టెక్నాలజీ, పరిశోధన రంగాలకు మరింత ఊతమిచ్చేలా అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 3 రోజుల జాతీయస్థాయి సైన్స్ అండ్ టెక్నాలజీ సమ్మేళనాన్ని నిర్వహించనుంది. డిసెంబరు 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న ఈ సమ్మేళనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, పరిశోధనా రంగ నిపుణులు, పీహెచ్ డీ పరిశోధకులు, విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నారు. శనివారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ సమ్మేళనం వివరాలను వెల్లడించారు. ఈ సమ్మేళనానికి కేంద్ర ప్రభుత్వ డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేష్ వాగ్మారే ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. దేశంలోని వివిధ ప్రముఖ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, పరిశోధనా రంగ నిపుణులు, ప్రముఖ శాస్త్రవేత్తలు సమ్మేళనంలో పాల్గొని తమ పరిశోధనలు, ఆలోచనలు, అనుభవాలను పంచుకోనున్నారు. అన్ని రంగాల్లో పరిశోధనలకు పెద్దపీట వేస్తూ శాస్త్రీయ పరిశోధనల విస్తృతికి ఈ సమ్మేళనం ప్రత్యేక వేదికగా నిలవనుందని ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్ ఛార్జి ఛైర్మన్ ఆచార్య ఎస్ విజయభాస్కరరావు, సీఎస్ఐఆర్ నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డైరెక్టర్ ఆచార్య ఆచంట వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యునైట్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సొసైటీ ఏర్పాటును తెలియజేసే పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

### 10000 మంది విద్యార్థులకు 'విజ్ఞాన్ సేతు'..

సైన్స్ అండ్ టెక్నాలజీ సమ్మేళనంతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధన పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో విజ్ఞాన్ సేతు పేరుతో భారీ సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 10000 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇస్రో, డీఆర్డీవో తదితర జాతీయ సంస్థలకు చెందిన నూతన పరిశోధనలకు సంబంధించిన యంత్రాలు, పరికరాలు, సాంకేతిక నమూనాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచనున్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హెల్త్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కేపీ సునీత ఈ ఎగ్జిబిషన్‌కు కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో తిరువనంతపురం ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ డాక్టర్ విజయమోహన్ పిళ్లై, వర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ చిల్లా మల్లారెడ్డి, ప్రొఫెసర్ సోమా వేణుగోపాలరావు, ఐఐటీ ముంబై ప్రొఫెసర్ శోభా శుక్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ సతీష్ కుమార్ అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

# పింఛను కోసం ఎవ్వరికీ రూపాయి ఇవ్వొద్దు

- 50 ఏళ్లు నిండిన నేతన్నలకు ఆర్థిక చేయూత
- మంత్రి సవిత
- దరఖాస్తుల పరిశీలనలో అక్రమార్కులపై వేటు
- లంచాలు తీసుకున్న ఇద్దరు అధికారుల సస్పెన్షన్

అమరావతి (సమయం న్యూస్): 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎటువంటి అక్రమాలు, అవినీతికి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు అందేలా దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల పరిశీలనలో కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తుండటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు చేయాలని భావిస్తుంటే, లంచాలకు కక్కుర్తిపడిన 2 గురు అధికారులను ఆమె తక్షణమే సస్పెండ్ చేయించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, నేతన్నల సేవలో పథకం అమలు తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. కొత్త పింఛన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటి పరిశీలన ఎలా సాగుతోందన్న వివరాలపై ఆరా తీశారు.

### రాష్ట్రవ్యాప్తంగా 16521 దరఖాస్తులు..

నూతన పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16521 దరఖాస్తులు అందినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా మంత్రికి వివరించారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు నేరుగా ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84000 మందికి పైగా చేనేతలకు పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు.

### ఎవ్వరికీ రూపాయి ఇవ్వొద్దు..

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తుదారుల నుంచి కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయని మంత్రి సవిత మండిపడ్డారు. చేనేతలందరికీ మేలు చేయాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో లాంటి కీలక పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని, ఇప్పుడు 50 ఏళ్లు నిండిన ప్రతి చేనేతకూ పింఛను అందించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లతో నీరుగార్చాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అర్హులైన ప్రతి నేతన్నకూ ప్రభుత్వం తరఫున పింఛను అందిస్తామని, ఎటువంటి అపోహలకు గురికావద్దని భరోసా ఇచ్చారు. ఎవ్వరికీ 1 రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని, అర్హత ఉంటే ప్రభుత్వమే నేరుగా పింఛను మంజూరు చేస్తుందని మంత్రి సవిత స్పష్టం చేశారు.





# బడి పిల్లలకు చికెన్ బిర్యానీ!

**మధ్యాహ్న భోజనంలో మాంసాహారం**

**వారానికి 1 సారి అందించేలా సర్కారు ప్లాన్**

**ప్రయోగాత్మకంగా అమలుకు తమిళనాడు సిద్ధం**

**శాకాహారుల కోసం ప్రత్యేక మెనూ**

**చెన్నై (సమయం న్యూస్):** మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు మాంసాహారాన్ని అందించాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వారానికి 1 సారి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆ రాష్ట్ర సీఎం విజయ్, విద్యాశాఖ మంత్రి రాజ్ మోహన్ కలిసి ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఈ పథకం ప్రయోగాత్మక దశలో ఉంది. పేద విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందించాలనే ఆలోచనతో ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్టు రాజ్ మోహన్ తెలిపారు. అయితే ఉన్నపళంగా దీన్ని ప్రవేశపెట్టదలుచుకోలేదని ఆయన చెప్పారు. భద్రత, శుభ్రతలను పాటిస్తూ ఈ పథకాన్ని ఎలా అమలు చేయవచ్చనే అవగాహన కోసం తొలుత ఎంచుకున్న కొన్ని పాఠశాలల్లోనే అమలు చేయాలని నిర్ణయించుకున్నామని వివరించారు. జైలు ఖైదీల కోసం కూడా చికెన్ బిర్యానీ వండుతున్నప్పుడు, చిన్నారుల కోసం వండలేమా అని ఆయన ప్రశ్నించారు.

### జులై నుంచే కసరత్తు..

ఈ పథకానికి జులై నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. పిల్లలకు చికెన్ బిర్యానీ అందించాలనే ఆలోచన రాగానే మంత్రి రాజ్ మోహన్ సీఎం విజయ్‌కు తెలిపారు. ఆయనకూ ఈ ఆలోచన నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీని ద్వారా పేద విద్యార్థులకు ప్రొటీన్లతో కూడిన ఆహారం లభిస్తుందని ఆయన భావించారు. కాగా బిర్యానీ ఉన్న రోజు శాకాహారుల కోసం ప్రత్యేక ఆహారం కూడా ఉండేలా పథకం నమూనా తయారైంది. తమిళనాడు ప్రభుత్వం భోజన పథకంపై ప్రత్యేకంగా శ్రద్ధ పెడుతోంది. ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నారు. అత్యంత సురక్షితంగా ఆహారాన్ని తయారు చేస్తున్నామని అధికార పక్షం చెబుతోంది. అలాగే బ్రేక్‌ఫాస్ట్ జాబితాలో కూడా మార్పులు చేస్తామని, పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారాన్నే ఇస్తామని ప్రభుత్వం వివరిస్తోంది.

# నిర్మల్ సాగర్ షురూ!

**సముద్ర వ్యర్థాల నియంత్రణకు సరికొత్త అడుగు**


**విశాఖలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం**

**ఏఐ సాంకేతికతతో ప్లాస్టిక్ గుర్తింపు, తొలగింపు**

**ఆర్కే బీచ్ వద్ద అవగాహన కోసం మానవహారం**

**విశాఖపట్నం (సమయం న్యూస్):** సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు 'నిర్మల్ సాగర్' పైలట్ కార్యక్రమం విశాఖలో ఘనంగా ప్రారంభమైంది. ఇన్ కాయిస్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విజ్ఞాన భారతి సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాస కుమార్ ప్రారంభించారు.

ఓషన్ మోడలింగ్, ఉపగ్రహ రిమోట్ సెన్సింగ్, ఏఐ ఆధారిత టూల్స్‌తో సముద్ర వ్యర్థాల హాట్‌స్పాట్‌లను సులువుగా గుర్తించి శుభ్రపరిచే చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీ ఎం.శ్రీభరత్, పలువురు అధికారులు, నేవీ, కోస్ట్ గార్డ్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆర్కే బీచ్ వద్ద ప్రజల్లో



పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేలా భారీ మానవహారం, బీచ్ శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.



# మహిళను కొట్టి చంపి..

## ఏడుస్తున్న చిన్నారిని మృతదేహంపై ఉంచిన దారుణం

### రాయచూర్ జిల్లాలో సంచలనం సృష్టించిన హత్య ఉదంతం

### తల్లి మృతదేహాన్ని పట్టుకుని నిస్సహాయంగా ఏడ్చిన ఏడాదిన్నర చిన్నారి

### ఆరా తీస్తున్న పోలీసులు.. భర్త, ప్రియుడు అదుపులోకి

**బెంగళూరు, సెప్టెంబర్ 19 (సమయం న్యూస్):** కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో అత్యంత ఘోరమైన, కలచివేసే ఘటన వెలుగులోకి వచ్చింది. కొందరు దుండగులు ఒక మహిళను దారుణంగా కొట్టి చంపి, ఆమె ఏడుస్తున్న ఏడాదిన్నర కుమార్తెను మృతదేహంపైనే ఉంచి పరారయ్యారు. సింధనూర్ సబ్ డివిజన్‌లోని ఆర్‌హెచ్ క్యాంప్ ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల స్నేహపై గ్రామం శివార్లలోని పొలంలో దుండగులు దాడి చేశారు. ఆమె తలపై రాయితో తీవ్రంగా బాది హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పొలాల్లో మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు, స్థానికులకు అక్కడ కనిపించిన దృశ్యం తీవ్రంగా చలించిపోయేలా చేసింది. మృతి చెందిన తల్లి స్నేహను గట్టిగా పట్టుకుని, ఆమె ఏడాదిన్నర కుమార్తె నిస్సహాయంగా ఏడుస్తూ కనిపించింది. పోలీసులు చిన్నారిని సురక్షితంగా ఒడిలోకి తీసుకుని, మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్నేహకు నాలుగేళ్ల కిందట అమిత్ అనే వ్యక్తితో వివాహమైంది. అయితే, గత నాలుగు నెలలుగా శుభమ్ అనే వ్యక్తితో ఆమె వివాహేతర సంబంధంలో ఉన్నట్లు తెలిసింది. ఈ కోణంలో విచారణ వేగవంతం చేసిన పోలీసులు, స్నేహ భర్త అమిత్‌తో పాటు ప్రియుడు శుభమ్‌ను కూడా అదుపులోకి తీసుకుని తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి, హత్యకు పాల్పడిన వారు ఎవరు అనే విషయాలను తేల్చేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# సౌదీకి కొత్త సంకటం!

## హౌతీలతో అమెరికా రహస్య చర్చలు..

### మస్కట్‌లో అమెరికా-హౌతీ ప్రతినిధుల భేటీ



**రియాద్, సెప్టెంబర్ 19 (సమయం న్యూస్):** యెమెన్‌లో హౌతీల దూకుడు, సౌదీ అరేబియాపై వరుస దాడుల నేపథ్యంలో అమెరికా–హౌతీ ప్రతినిధుల మధ్య ఒమన్ రాజధాని మస్కట్‌లో జరిగిన రహస్య చర్చలు కొత్త చర్చకు తెరతీశాయి. అమెరికా అధికారులు హౌతీ ప్రతినిధులతో గత వారాంతంలో సమావేశమైనట్లు ఐదు వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వెల్లడించింది. అయితే ఈ చర్చలను అమెరికా విదేశాంగ శాఖ అధికారికంగా ధ్రువీకరించలేదు. హౌతీలు ఇటీవలి దాడుల్లో యెమెన్ ఎర్ర సముద్ర తీరంలో కీలక ప్రాంతాలను స్వాధీనం చేసుకుని, బాబ్ ఎల్––మండెబ్ జలసంధి సమీపంలోని పెరిమ్ దీవిపైనా పట్టు సాధించారు. సౌదీ చమురు రవాణాకు ఈ మార్గం అత్యంత కీలకంగా మారిన సమయంలో హౌతీల పురోగతి రియాద్‌పై ఒత్తిడిని పెంచుతోంది. మస్కట్ చర్చల్లో అమెరికా నౌకలపై దాడులు చేయబోమని, 2025లో వాషింగ్టన్‌తో కుదిరిన కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటామని హౌతీ ప్రతినిధులు చెప్పినట్లు రాయిటర్స్ పేర్కొంది. ఒక యెమెన్ వర్గం ప్రకారం.. ఇజ్రాయెల్, ఇతర వాణిజ్య నౌకలపైనా దాడులు చేయకుండా సౌదీ అరేబియాకు చెందిన నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటామని హౌతీలు తెలిపినట్లు సమాచారం. అయితే దీనిని అమెరికా––హౌతీల మధ్య సౌదీకి వ్యతిరేకంగా కుదిరిన అధికారిక 'ఒప్పందం'గా ప్రకటించే ఆధారాలు ఇప్పటివరకు వెలుగులోకి రాలేదు. హౌతీల తాజా దూకుడు నేపథ్యంలో సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంప్రదించి సైనిక సహాయం కోరినట్లు రాయిటర్స్ తెలిపింది. అయితే యెమెన్ పోరులో నేరుగా జోక్యం చేసుకునేందుకు వాషింగ్టన్ సుముఖత చూపలేదని ఆ కథనం పేర్కొంది. సౌదీ అరేబియాలోని నగరాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై ఇటీవల దాడులు పెరిగాయి. మక్కా వైపు వస్తున్న హౌతీ డ్రోన్‌ను నగరానికి దక్షిణంగా కూల్చివేసినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ప్రకటించాయి. అయితే మక్కా లేదా ఇతర పవిత్ర ప్రదేశాలను తాము లక్ష్యంగా చేసుకోలేదని హౌతీలు ఖండించారు. అందువల్ల మక్కాపై ఉద్దేశపూర్వకంగా దాడికి ప్రయత్నించారనే అంశంపై ఇరుపక్షాల వాదనలు భిన్నంగా ఉన్నాయి. పాకిస్థాన్, టర్కీతో సౌదీకి రక్షణ సహకార ఒప్పందం ఉన్నప్పటికీ యెమెన్ యుద్ధంలో ఆ వ్యవస్థ ఇంకా పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దేశీయ ఆమోద ప్రక్రియలు, రాజకీయ–వ్యూహాత్మక పరిమితుల కారణంగా ప్రత్యక్ష సైనిక సహకారం కనిపించడం లేదని విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల మధ్య సౌదీపై హౌతీల దాడులు కొనసాగుతుండటం, అమెరికా ప్రత్యక్ష సైనిక జోక్యానికి దూరంగా ఉండటం, మరోవైపు హౌతీలతో వాషింగ్టన్ సంప్రదింపులు జరపడం మధ్యప్రాచ్య సమీకరణాలను మరింత సంక్లిష్టంగా మార్చాయి. అయితే 'అమెరికా సౌదీని మోసం చేసింది', 'హౌతీలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుంది' అనేవి ప్రస్తుత ఆధారాలతో నిర్ధారిత వాస్తవాలుగా చెప్పలేం; మస్కట్‌లో రహస్య చర్చలు జరిగినట్లు మాత్రమే విశ్వసనీయంగా వెల్లడైంది.

# వాతావరణ సవాళ్లకు భారత్ పరిష్కారాలు

- ఢిల్లీలో అంతర్జాతీయ పర్యావరణ సదస్సు ప్రారంభం
- రెండు రోజుల సదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ
- 17 దేశాల న్యాయమూర్తులు, న్యాయ ప్రతినిధుల భాగస్వామ్యం
- 50 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ వ్యవస్థలు: మోదీ
- అభివృద్ధి చెందుతున్న దేశాలపై నిందలు సరికాదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (సమయం న్యూస్):** ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న పర్యావరణ, వాతావరణ సవాళ్లకు సమష్టి పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జాతీయ హరిత న్యాయస్థానం ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహిస్తున్న 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరిగే ఈ సదస్సులో భారత్‌తోపాటు 17 దేశాలకు చెందిన ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయ ప్రతినిధులు పాల్గొంటున్నారు. సదస్సు ప్రారంభ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, జాతీయ హరిత న్యాయస్థానం చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ హరిత న్యాయస్థానం మొబైల్ అప్లికేషన్‌ను మోదీ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే దిశగా భారత్ పనిచేస్తోందని మోదీ తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద 50 లక్షలకు పైగా ఇళ్లపై సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత 12 ఏళ్లలో దేశ సౌర విద్యుత్ సామర్థ్యం సుమారు 2 గిగావాట్ల నుంచి 160 గిగావాట్లకు పైగా పెరిగిందన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం కూడా భారీగా పెరిగిందని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై అధిక బాధ్యత మోపడం సరికాదని మోదీ వ్యాఖ్యానించారు. భారత్‌తో పోలిస్తే అభివృద్ధి చెందిన దేశాల్లో తలసరి కర్బన ఉద్గారాలు సుమారు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. భారత్ తలసరి ఉద్గారాలు ప్రపంచ సగటులో సగానికంటే తక్కువగా ఉన్నాయని వివరించారు. వాతావరణ మార్పులపై పోరులో సమానత్వం, న్యాయం ప్రాతిపదికగా అంతర్జాతీయ సహకారం అవసరమని చెప్పారు. వాతావరణ న్యాయం, జీవవైవిధ్యం, పర్యావరణ చట్టాలు, పునరుత్పాదక ఇంధనం, సుస్థిర నగరాలు, పర్యావరణ పరిపాలన వంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. విధానాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలోని లోపాలను గుర్తించడంతోపాటు వివిధ దేశాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, అనుభవాలను పంచుకోవడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఉంది.

# 51 వేల మందికి కేంద్ర కొలువులు

### 20వ రోజ్‌గార్ మేళాలో నియామక పత్రాలు

### 45 ప్రాంతాల్లో ఏకకాలంలో కార్యక్రమం

### 2047 వికసిత భారత్‌లో యువతదే కీలక పాత్ర: మోదీ

### వెయ్యి ఐటీఐల ఆధునీకరణకు రూ.60 వేల కోట్లు

### ఇప్పటివరకు 12.75 లక్షల మందికి నియామక పత్రాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా నిర్వహించిన 20వ 'రోజ్‌గార్ మేళా'లో 51 వేల మందికి పైగా యువతకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థల్లో నియామక పత్రాలు అందజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొని కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న యువతను ఉద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే ప్రయాణంలో యువత కీలక పాత్ర పోషించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలోకి అడుగుపెడుతున్న యువత తీసుకునే ప్రతి నిర్ణయం 'వికసిత భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలను బలోపేతం చేసేలా ఉండాలని పేర్కొన్నారు. పండుగల వేళ వేలాది కుటుంబాల్లో ఈ నియామకాలు కొత్త ఆనందాన్ని తీసుకొచ్చాయని చెప్పారు. భారత యువత ప్రతిభ, నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. 'పీఎం సేతు' పథకానికి రూ.60 వేల కోట్ల వ్యయం కేటాయించగా, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా వెయ్యి ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరించే కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో 200 హబ్ ఐటీఐలు, 800 స్పోక్ ఐటీఐలు ఉన్నాయి. రైల్వే, హోంశాఖ, రక్షణ, రెవెన్యూ, ఆరోగ్య–కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులకు తాజా నియామక పత్రాలు అందాయి. 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు సుమారు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు, సంస్థల్లో నియామక పత్రాలు అందించినట్లు కేంద్రం వెల్లడించింది. ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి ఉద్యోగ అవకాశాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. ప్రభుత్వ సేవలో చేరిన వారు ప్రజలకు సమర్థంగా, నిజాయతీగా సేవలందిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

# ఎమ్మెల్యే ఖాతాలో సైబర్ లూటీ!

### యూపీ బీజేపీ ఎమ్మెల్యే పూజా పాల్ ఖాతా నుంచి నగదు మాయం

### సుమారు 1.55 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

### 22 రోజుల వ్యవధిలో ఫోన్ పే, యూపీఐ ద్వారా విత్‌డ్రా

### ప్రయాగ్‌రాజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు


**లక్నో (సమయం న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లా చైల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పూజా పాల్ ఖాతా నుంచి సుమారు 1.55 లక్షలు మాయమయ్యాయి. ఎవరో సైబర్ నేరగాళ్లు మోసపూరితంగా ఆమె ఖాతా నుంచి నగదును విత్‌డ్రా చేశారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 13 మధ్య పలు దఫాల్లో ఫోన్ పే, యూపీఐ ద్వారా ఈ లావాదేవీలు జరిగినట్లు బాధితురాలు గుర్తించారు. ఈ విషయం ఆమెకు ఈ నెల 14 న తెలిసింది. తన బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను పరిశీలించగా, తనకు తెలియకుండానే పలు లావాదేవీలు జరిగినట్లు ఆమె గుర్తించారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

### ఐఫోన్ హ్యాక్ అయిందని అనుమానం..

పూజా పాల్‌కు ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఖాతా ఉంది. తన ఐఫోన్ 17 ఎయిర్‌ను ఎవరో హ్యాక్ చేసి ఉండవచ్చని, తన బ్యాంకింగ్, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసి నగదు ఉపసంహరించి ఉండవచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన అన్ని లావాదేవీలపై దర్యాప్తు చేయాలని పూజా పాల్ సైబర్ క్రైమ్ పోలీసులను కోరారు. తన మొబైల్ ఫోన్‌కు టెక్నికల్ ఆడిట్ నిర్వహించడంతోపాటు, ట్రాన్సాక్షన్ ఐడీలు, బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సైబర్ సెల్ సహాయంతో పోలీసులు పూర్తి వివరాలను పరిశీలిస్తున్నారు.

# వీళ్లకు స్టూడెంట్స్ వద్దు.. అంధభక్తులే కావాలి

- ప్రశ్నించే విద్యార్థులంటే వ్యవస్థకు భయం: రాహుల్
- విద్య, ఉద్యోగాలు, పేపర్ లీకులపై యువత గళమెత్తాలని పిలుపు
- రాజ్యాంగ సంస్థల పనితీరును ప్రశ్నించాలని సూచన
- సమస్యలను రాహుల్ ముందుంచిన విద్యార్థులు
- భయపడకుండా హక్కుల కోసం నిలబడాలని పిలుపు



**ఇండోర్, సెప్టెంబర్ 19 (సమయం న్యూస్):** "విద్యార్థి సహజంగానే ప్రశ్నిస్తాడు.. కొత్త విషయాలను తెలుసుకోవాలని ప్రయత్నిస్తాడు. అందుకే ప్రస్తుత వ్యవస్థకు విద్యార్థులంటే భయం. వీళ్లకు ప్రశ్నించే స్టూడెంట్స్ వద్దు.. చెప్పినదాన్ని గుడ్డిగా నమ్మే అంధభక్తులే కావాలి" అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. విద్య, ఉపాధి, నియామక పరీక్షలు, పేపర్ లీకులు తదితర అంశాలపై మాట్లాడారు. విద్యార్థుల్లో జిజ్ఞాస, ప్రశ్నించే తత్వం ఉంటుందని, భిన్నమైన ఆలోచనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారని రాహుల్ పేర్కొన్నారు. అయితే ప్రశ్నించని వారినే ప్రస్తుత వ్యవస్థ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. యువతలో ప్రశ్నించే స్వభావాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం సహా రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరుపైనా యువత ప్రశ్నలు సంధించాలని రాహుల్ సూచించారు. విద్యాసంస్థల్లో సమస్యలు, నిరుద్యోగం, నియామకాల్లో జాప్యం, పేపర్ లీకుల వంటి అంశాలపై మౌనంగా ఉండకుండా గళమెత్తాలని పిలుపునిచ్చారు. వ్యవస్థపై తాను చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు రాజకీయ విమర్శలేనని సంబంధిత వార్తా కథనాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ సమస్యలను రాహుల్ దృష్టికి తీసుకువచ్చారు. పరీక్షలు సకాలంలో జరగకపోవడం, ఉద్యోగ ఖాళీల భర్తీలో జాప్యం, విద్యార్థుల ఆందోళనలపై కేసులు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కొరత వంటి అంశాలను ప్రస్తావించారు. కొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య, విద్యా సదుపాయాల కొరతపైనా విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. యువత భయపడకుండా ప్రశ్నించాలని, తమ హక్కులు, విద్య, ఉపాధి అవకాశాల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో గొంతెత్తాలని రాహుల్ పిలుపునిచ్చారు. "విద్య విలాసం కాదు.. హక్కు" అని పేర్కొంటూ సమర్థమైన విద్యా వ్యవస్థను అందించడం ప్రభుత్వ బాధ్యతని వ్యాఖ్యానించారు.

# ఢిల్లీ వర్సిటీలో ఏబీవీపీ హవా

### నాలుగింట మూడు కీలక పదవులు కైవసం

### అధ్యక్షుడిగా యశ్ దబాస్.. ఉపాధ్యక్షుడిగా స్వతంత్ర అభ్యర్థి దీపాంశు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (సమయం న్యూస్):** ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాలుగు ప్రధాన పదవుల్లో మూడింటిని కైవసం చేసుకుంది. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ అభ్యర్థులు గెలుచుకోగా, ఉపాధ్యక్ష పదవిలో స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ విజయం సాధించారు. కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐకి కేంద్ర ప్యానెల్‌లో ఒక్క పదవీ దక్కలేదు. అధ్యక్ష పదవికి ఏబీవీపీ అభ్యర్థి యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించారు. ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాకు 22,523 ఓట్లు రాగా, 2,053 ఓట్ల ఆధిక్యంతో దబాస్ విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన దీపాంశు షోకీన్ 30,615 ఓట్లతో గెలుపొందారు. ఆయన సమీప ప్రత్యర్థి ఏబీవీపీకి చెందిన ఇషు మౌర్యకు 16,910 ఓట్లు వచ్చాయి. కార్యదర్శి పదవిని ఏబీవీపీ అభ్యర్థి రియా ఛాఢ్డీ 21,650 ఓట్లతో దక్కించుకున్నారు. ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి నమ్రతా చౌదరికి 14,869 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శి పదవిలో ఏబీవీపీ అభ్యర్థి లక్ష్య రాజ్ సింగ్ విజయం సాధించారు. ఈ స్థానంలో తుది ఓట్ల సంఖ్యపై వార్తా సంస్థల కథనాల్లో స్వల్ప వ్యత్యాసం కనిపిస్తోంది–కొన్ని కథనాలు 16,615గా, మరికొన్ని 16,641గా పేర్కొన్నాయి. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని 52 కేంద్రాల్లో జరిగిన పోలింగ్‌లో 40.46 శాతం ఓటింగ్ నమోదైంది. ఫలితాల లెక్కింపు ఉత్తర క్యాంపస్‌లోని యూనివర్సిటీ స్పోర్ట్స్ స్టేడియం మల్టీపర్పస్ హాల్‌లో 20 రౌండ్లపాటు సాగింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విజేతలు, వారి మద్దతుదారులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకుండా ఆంక్షలు విధించారు. భారీ భద్రత మధ్య ఓట్ల లెక్కింపు పూర్తయింది.

# జల దిగ్బంధంలో సంఘమిత్రనగర్

### రోడ్లు, డ్రైనేజీ లేక అవస్థలు..

### మూడేళ్లుగా అర్జీలు ఇచ్చినా పరిష్కారం కరువు

**గుంటూరు, సెప్టెంబర్ 19:** పాత గుంటూరు, మనీ హోటల్ సెంటర్, రాజీవ్ గృహకల్ప రోడ్డులోని సంఘమిత్ర నగర్‌లో మౌలిక వసతుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2017లో ఏర్పడిన ఈ కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నా రోడ్లు, మురుగు





కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. వర్షాలు కురిసినప్పుడు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతుండగా, పాములు, పందుల సంచారం, దోమల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మురుగునీటి నిల్వతో దుర్గంధం వ్యాపిస్తోందని వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒక్కో ఇంటికి రూ.5-7 లక్షల వరకు ప్లాన్ అనుమతుల రుసుములు చెల్లించినప్పటికీ మౌలిక వసతులు కల్పించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. గత మూడేళ్లలో గ్రీవెన్స్‌లో పలుమార్లు అర్జీలు ఇచ్చామని, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ప్రస్తుత ఎమ్మెల్యే నజీర్ అహ్మద్‌ల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టి కాలనీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంఘమిత్ర నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కృషి

### కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ



**గుంటూరు, సెప్టెంబర్ 19:** ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ లేని యానాది కులానికి చెందిన 531 మందిని గుర్తించామని, డొమిసిల్ సర్టిఫికెట్ తహసిల్దార్ నుండి ఇప్పించి ఆధార్ కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. గిరిజన భవన్ మరమ్మతుల పనులు మంజూరు చేశామని అన్నారు. అంబేద్కర్ భవన్ పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందించుటకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. జిల్లాలో మార్పు కార్యక్రమం ప్రత్యేకంగా తీసుకున్నామని, ఈ కార్యక్రమంలో వసతి గృహాలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలలో అన్ని వసతులు కల్పించాలని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులపై జరిగే దాడులపై నిబంధనల మేరకు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మొత్తం కేసులు, డ్రాప్ చేసిన కేసులు వివరాలు కూడా సమావేశంలో అందించాలని పోలీసు శాఖను ఆదేశించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించుటకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ దుకాణాలు నిబంధనల మేరకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. వసతి గృహాలలో మెనూ పక్కాగా, నాణ్యమైన ఆహార పదార్థాలు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలపై వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని, ఆ మేరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిర్దేశిత సమయంలో న్యాయం లబ్ధిదారులకు అందించేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో సునిశితమైన కేసుల వివరాలు పోస్టు చేయరాదని స్పష్టం చేశారు. ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్ లో కేసులు ఉండకుండా, కేసులు సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పింఛను మంజూరు చేయుటకు విద్యుత్ కనెక్షన్ నంబర్ విధిగా ఉండాలని ఎస్జీఎస్‌డబ్ల్యూ సిబ్బంది అంటున్నారని దానిపై దృష్టి సారించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టి చట్టాలపై మరింత అవగాహనను పోలీసు శాఖకు అందించడం అవసరమని అభిప్రాయపడ్డారు. కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ జూలై నుండి ప్రత్తిపాడులో కేసు పెడుతుంటే తీసుకోవడం లేదన్నారు. అనునిత్యం అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పంచర్ ప్రూఫ్ గ్లౌస్ లు పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ఎస్.సి, ఎస్.టిలకు మంజూరు చేసిన దుకాణాలు, వారే అనుభవించేటట్లు చూడాలని, లబ్ధిదారులు ఇతరులకు ఇచ్చినా చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహాలలో ఆహార పదార్థాలు నాణ్యత మెరుగు పరుచుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ,జిల్లా సాంఘిక సంక్షేమ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు, డి.ఎస్.పిలు, కమిటీ సభ్యులు అనురాధ, గుడెపు అశ్వినీ కుమార్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ధ్యేయం కావాలి

**గుంటూరు, సెప్టెంబరు 19:** పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో శనివారం చేపట్టారు. జిల్లాలో నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశాలు మేరకు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ప్రజలతో స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ పెదకాకాని మండలంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్యారీబ్యాగులు, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, కార్యక్రమంలో ప్రజలందరూ



భాగస్వాములు కావాలన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో మంచి అవగాహన కలుగుతుందని అన్నారు. క్యారీ బ్యాగులు, ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్, చెత్త వ్యర్థాలను క్లాప్ మిత్రాలకు అప్పగించాలని కోరారు. పరిశుభ్రత చోటుచేసుకున్న ప్రాంతాల్లో అక్కడ ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పిస్తే ఆ ప్రదేశంలో చెత్త వేసేందుకు ఎవరు ముందుకు రావడం జరగదని చెప్పారు. రోజువారీ అవసరాలు కోసం ప్లాస్టిక్ కవర్ల స్థానంలో కాటన్, గన్ని బ్యాగులు వాడాలని కోరారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేదించి, ఒక మంచి అలవాటుగా మార్చుకుని స్ఫూర్తిదాయంగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# తాడికొండలో గణపతి ఉత్సవాలు

**తాడికొండ, సెప్టెంబర్ 19:** మండల కేంద్రమైన తాడికొండలో గణపతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. తాడికొండ శివారు బడేపురం సెంటర్‌లోని శ్రీ దాసాంజనేయ స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తాడికొండ శివాలయం వీధిలోని తాడికొండ భవాని పీఠం వ్యవస్థాపకులు గురూజీ కొల్లిపర నాగ కోటేశ్వర శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీమతి శర్వాణి శనివారం ఉదయం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా కనిపించాయి. ఈ కార్యక్రమంలో తాడికొండకు చెందిన పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. చిన్న హనుమంతరావు తదితరులు హాజరై శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గణపతి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను పలువురు అభినందించారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో గుంటూరు రూపురేఖల్లో మార్పు

### గుంటూరు కమిషనర్ కె. మయూర్ అశోక్




**గుంటూరు, సెప్టెంబర్ 19:** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలతో నగర పారిశుధ్య నిర్వహణలో గుణాత్మక మార్పులు వస్తున్నాయని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. జీఎంసీ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి జాతీయ రహదారి వరకు నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో పాల్గొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. నగర ప్రధాన ప్రవేశ మార్గాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, ఫ్లైఓవర్ల గోడలు, పిల్లర్లకు ఆకర్షణీయమైన పెయింటింగ్స్ వేయడంతో పాటు పచ్చదనం పెంచాలని అధికారులను ఆదేశించారు. వాహనదారుల సౌకర్యార్థం స్పష్టమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్టోబర్ 17 వరకు 'స్వచ్ఛత హీ సేవా'లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పాటిస్తూ స్వచ్ఛ గుంటూరు నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు జి. సాంబశివరావు, బి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అమరావతి ప్రాంతవాసులకు ఉచిత బార్బరింగ్ శిక్షణ


**మంగళగిరి సెప్టెంబర్19:** రాజధాని అమరావతి ప్రాంత గ్రామాలకు చెందిన పురుషులకు ఉచితంగా మెన్ అడ్వాన్స్‌డ్ బార్బరింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు ఏపీ సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఏపీ సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల పురుషులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. రెండు నెలలపాటు శిక్షణ కొనసాగుతుందని, ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో శిక్షణకు సెలవు ఉంటుందని తెలిపారు. మెన్ అడ్వాన్స్‌డ్ బార్బరింగ్‌లో నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా అమరావతి ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలను పెంచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఏపీ సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. శిక్షణకు ఆసక్తి ఉన్న వారు పోస్టర్‌లోని క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 30 రిజిస్ట్రేషన్‌కు గడువు తేదీ అని అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న అర్హులు గడువు లోగా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీఆర్‌డీఏ అధికారులు కోరారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు ఓటరుగా నమోదు కావాలి

**గుంటూరు, సెప్టెంబర్ 19 :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరుగా ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తెలిపారు. గతంలో తయారు చేసిన ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిందేనని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ కృష్ణ - గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ప్రస్తుత హోదా 2027 మార్చి 29వ తేదీన ముగుస్తుందన్నారు. కృష్ణ - గుంటూరు ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల నోటిఫికేషన్ ఈ నెల 28వ తేదీన ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమానికి బహిరంగ నోటీస్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 15, 25 తేదీలలో వార్తా పత్రికలు ద్వారా ప్రచురణ రెండు సార్లు జరుగుతుందన్నారు. నవంబరు 6వ తేది వరకు ఓటరు నమోదుకు ఫారం 19 స్వీకరణ జరుగుతుందన్నారు. నవంబరు 25వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల, డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 25వ తేదీ నాటికి అభ్యంతరాల పరిష్కారం జరుగుతుందని వివరించారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా విడుదల జరుగుతుందని చెప్పారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్.ఐ.ఆర్) కింద 1,68,220 నోటీసులు జారీ చేయగా, 1,094 మాత్రమే విచారణ పెండింగ్ లో ఉందన్నారు. ఫారం 6 - 12,044, ఫారం 7 - 2,047, ఫారం 8 - 9,085 దరఖాస్తులు అందాయన్నారు. ఇప్పటి వరకూ ఫారం 6 క్రింద అందిన వాటిలో 8,407 దరఖాస్తులు ఓటరుగా నమోదు చేయడం జరిగిందని, 370 తిరస్కరించడం జరిగిందని వివరించారు. ఫారం 7 క్రింద అందిన దరఖాస్తులలో 1,899 ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని, మూడు తిరస్కరించడం జరిగిందని చెప్పారు. ఫారం 8 క్రింద అందిన దరఖాస్తులలో 6,859 ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని, 608 తిరస్కరించడం జరిగిందని చెప్పారు. బుక్ ఎ కాల్ క్రింద రాష్ట్రంలో అత్యధికంగా వచ్చిన కాల్స్ లో గుంటూరు జిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి,ఈ.ఆర్.ఓ లు ఐ.కిషోర్, పద్మావతి, గంగ రాజు, ముఖ్య టౌన్ ప్లానింగ్ అధికారి రాంబాబు, కాంగ్రెసు పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు



కంచర్ల శివరామయ్య, ఎన్.ఓంకార్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వై వి సుబ్బారావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ఆర్.వి.నరసింహా రావు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# నట సామ్రాట్, నట సార్వభౌముడు అక్కినేని

## నేడు నాగేశ్వరరావు జయంతి

తెలుగు చిత్రసీమను దశాబ్దాల పాటు నిరాటంకంగా ఏలిన రాజులు ఇద్దరు. ఒకరు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రాముడు, మరొకరు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. చిత్ర సీమలో నటులుగా పోటీ పడినా, జీవితంలో సోదర భావంతో మెలిగిన ఇరువురూ తెలుగు ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. డాక్టర్ నందమూరి తారక రామారావు, డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు... ఇద్దరూ ఇద్దరే. తెలుగు చిత్రరంగానికి రెండు కళ్లు. తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోలకు కొరతగా ఉన్న రోజుల్లో ప్రవేశించి, తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి చేరుకుని తెలుగు జాతి గర్వించదగ్గ చిత్రాలను ఇద్దరూ అందించారు. దశాబ్దాల తరబడి తెలుగు చిత్ర పరిశ్రమకు వీరిద్దరూ రథచక్రాలుగా నిలిచారు. తెలుగు చిత్రరథాన్ని తెలుగు గడ్డకు తరలించడానికి ఎంతో కృషి చేశారు. అంతేకాదు వీళ్లిద్దరూ తెలుగు చిత్ర పరిశ్రమకు క్రమశిక్షణ నేర్పారు. ఆరోగ్య విషయాలతో సహా అన్నింటా క్రమశిక్షణతో మెలిగారు. తెలుగు చిత్ర పరిశ్రమకు గుర్తింపు, గౌరవం, హోదా, డబ్బు తెచ్చిపెట్టిన ఘనత వీరిద్దరిదే. 'స్టార్‌డమ్' అనే మాట ఈ మహానటుల కాలంలోనే తెలుగునాట ప్రవేశించింది. అయితే ఆ అగ్ర శ్రేణి కథా నాయకుల మధ్య కొన్ని పోలికలున్నాయి. ఇద్దరిలో కొన్ని సారూప్యాలు, మరికొన్ని వైరుధ్యాలు కూడా ఉన్నాయి. ఇద్దరూ హీరోలు కాకముందు స్టేజీ మీద స్త్రీ పాత్రలు పోషించారు. అక్కినేని 'హరిశ్చంద్ర'లో చంద్రమతి వేషం వేస్తే... 1940లో కాలేజిలో ఇంటర్ చదివే రోజుల్లో 'రాచమల్లు దౌత్యం' నాటకంలో నందమూరి నాగమ్మ వేషం వేశారు. 1932లో మాట నేర్చి, టాకీ చిత్రానికి శ్రీకారం చుట్టిన తెలుగు సినిమా తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సమయంలో నాగేశ్వరరావు చిత్రరంగం లోకి ప్రవేశించారు. ఆయన వచ్చిన ఏడేళ్ల అనంతరం రామారావు సినీ రంగ ప్రవేశం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు మొదటి చిత్రం 'ధర్మపత్ని'. ఎన్టీఆర్ తొలి సినిమా 'మనదేశం'. వీరు మొదటి చిత్రాల్లో గుర్తింపు పొందని పాత్రల్లో నటించారు. అంతేకాదు ఆ తర్వాత కొన్నేళ్లకు ఆరు నెలల తేడాతో హైదరాబాద్‌లో స్టూడియోలు నిర్మించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అక్కినేని అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేస్తే.. ఎన్టీఆర్ రామకృష్ణ హార్టికల్చరల్ సినీ స్టూడియోస్ స్థాపించారు. తెలుగు వెండి తెర స్వర్ణ యుగం తొలి దశాబ్ద కాలంలో విడుదలైన చిత్రాల సంఖ్యలో సగభాగం ఈ మహానటులు నటించిన చిత్రాలే ఉండటం గమనార్హం. మకుటం లేని మహారాజుల్లా అగ్ర నటులుగా కొనసాగిన వీరిద్దరూ ఎలాంటి భేషజాలకు పోకుండా పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాలు 14 సినిమాల్లో కలిసి నటించారు. ప్రపంచ సినీ చరిత్రలో ఏ ఇద్దరు అగ్రనటులు ఇన్ని సినిమాల్లో ఇన్ని బ్యానర్స్‌లో కలిసి నటించలేదు. ఇది ఒక రికార్డు. 1950లో 'పల్లెటూరి పిల్ల'తో ప్రారంభించి, ఆ తరువాత సంసారం (1950), పరివర్తన (1954), మిస్సమ్మ (1955), తెనాలి రామకృష్ణ (1956), చరణదాసి (1956), మాయాబజార్ (1957), భూకైలాస్ (1958), రేచుక్క (అక్కినేని గెస్ట్.. 1954), గుండమ్మ కథ (1962), శ్రీకృష్ణార్జున యుద్ధం (1963), చాణక్య-చంద్రగుప్త (1977), రామకృష్ణులు (1978), చివరగా సత్యం-శివం (1981) చిత్రాల్లో వీళ్లిద్దరు కలిసి నటించారు. శ్రీకృష్ణార్జున యుద్ధం చిత్రం తరువాత దాదాపు 14 ఏళ్లపాటు ఈ అగ్రనటులిద్దరి మధ్య మాటలే లేక పోవడం గమనార్హం. మళ్లీ 1977లో విడుదలైన 'చాణక్య - చంద్రగుప్త' చిత్రంతో ఈ ఇద్దరు అగ్రనటులు కలిసి నటించారు. ఈ చిత్రాన్ని రామారావు ఆయన సొంత నిర్మాణ సంస్థ రామకృష్ణ సినీ స్టూడియోస్ బ్యానర్‌లో స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ చంద్రగుప్తుడుగా నటిస్తే.. అక్కినేని చాణక్యుడిగా నటించారు. తమిళ అగ్ర నటుడు శివాజీ గణేషన్ ఈ చిత్రంలో అలెగ్జాండర్ పాత్రలో నటించారు. చాణక్య చంద్రగుప్త తరువాత తన రెగ్యులర్ ప్రొడ్యూసర్ వి.బి.రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి నాగేశ్వరరావు నిర్మించిన రామకృష్ణులు చిత్రంలో కలిసి నటించారు. ఎన్టీఆర్ పెద్ద అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు నిర్మాణంలో కే.రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన సత్యం - శివం వీరిద్దరి కలయికలో వచ్చిన చివరి చిత్రం. తెలుగు చిత్ర పరిశ్రమను విస్తృతం చేయాలనే లక్ష్యంతో, ధ్యేయంతో కృషి చేసిన అక్కినేని, నందమూరి సేవలను ప్రేక్షకులే కాదు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 1968 జనవరి 26న ఇద్దరినీ ఒకేసారి పద్మశ్రీ బిరుదుతో సత్కరించి, గౌరవించడం విశేషం. 1964లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నంది అవార్డులు ఈ ఇద్దరు అగ్ర నటులు నటించిన చిత్రాలకు దక్కడం విశేషం. ఈ అగ్ర నటులు ఇద్దరూ హిందీ సినిమాల్లో నటించారు. అక్కినేని 'సువర్ణ సుందరి' హిందీ రీమేక్‌లో నటిస్తే...ఎన్టీఆర్ 'చండీరాణి', 'నయా ఆద్మీ' సినిమాల్లో నటించారు. వీళ్లిద్దరు తమిళంలో కూడా తమ సత్తా చాటారు. ఏఎన్నార్, ఎన్టీఆర్ ఇద్దరూ కృష్ణా జిల్లా నుంచి వచ్చినవారే. అక్కినేనిది గుడివాడ తాలూకా వెంకట రాఘవపురం, రామారావుది నిమ్మకూరు. వీరిద్దరూ సినీ పరిశ్రమకు నట వారసులను అందించారు. ఈ రెండు కుటుంబాలకు చెందిన మూడో తరం నట వారసులు కూడా సినిమాల్లో తమదైన ప్రత్యేకతతో రాణిస్తుండటం విశేషం. ఎన్టీఆర్ తన అర్ధాంగి జ్ఞాపకార్థం బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిని నిర్మించారు. అక్కినేని తన జీవిత భాగస్వామి పేరిట అన్నపూర్ణ స్టూడియో కట్టించారు. ఈ అగ్ర నటుల భార్యలు వీరిద్దరి కంటే ముందు కన్ను మూసారు. అక్కినేని కంటే ఏడాదిన్నర పెద్ద అయిన ఎన్టీఆర్ సినిమాల్లో రావడానికి పెద్దగా కష్టపడలేదు. వెయ్యి నూట పదహార్ల అడ్వాన్సుతో బి.ఏ.సుబ్బారావు సినిమాలో రామారావు హీరోగా బుక్ అయ్యారు. పాత్రల ఎంపికలో అక్కినేని ఆచితూచి అడుగులు వేస్తే..ఎన్టీఆర్ మాత్రం హీరోయిజం వున్న సినిమాలతో పాటు ప్రతి నాయక పాత్రలు తాగుబోతు, దివ్యాంగుల పాత్రలు వేయడానికి వెనకడుగు వేయలేదు. తన తన నట జీవితంలో ఏఎన్నార్ ఎపుడు కృష్ణుడి పాత్రని వేయలేదు. కానీ సిపాయి చిన్నయ్య చిత్రంలో ఓ పాటలో కృష్ణుడిగా కాసేపు అలా కనిపించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి పార్టీ పెట్టాలనుకున్నప్పుడు అక్కినేనితో సంప్రదించి, ఆయనని కూడా రాజకీయాల్లోకి ఆహ్వానించారు రామారావు. తన ఆరోగ్య కారణాల వల్ల రాలేనని చెప్పి, తన అభినందనలు తెలియ జేసారు నాగేశ్వరరావు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎన్టీఆర్ పదవులు ఆఫర్ చేసినా...మన స్నేహం ముఖ్యమైంది. ఈ పదవులు ఎందుకు బ్రదర్ అని చెప్పి సున్నితంగా తిరస్కరించారు అక్కినేని. ఇంతటి అనుబంధం కలిగిన వీరిద్దరి మధ్య అన్నపూర్ణ స్టూడియోస్‌కి సంబంధించిన ఏడెకరాల స్థలం విషయంలో మళ్లీ మనస్పర్థలు ఏర్పడి దాదాపు ఏడేళ్లు దూరమయ్యారు. అలా దూరం కావడానికీ, తిరిగి తామిద్దరం దగ్గర కావడానికీ కూడా రామారావే కారణమని అక్కినేని చెప్పేవారు. తెలుగు సినిమాకి స్టార్‌డమ్ నేర్పిన ఈ మహానటులిద్దరూ తమ మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ ఏనాడూ బహిరంగంగా ఒకరినొకరు నిందించు కోలేదు. చివరగా వీరిద్దరు ఒకే నెల (జనవరి)లో కన్నుమూసారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 1857 తిరుగుబాటు

## ఢిల్లీ పతనంతో మొఘల్ అంత్యగీతం, స్వాతంత్ర్య స్వరం

### సెప్టెంబర్ 20, 1857 : తిరుగుబాటుదారుల త్యాగానికి జ్ఞాపకం

**1857 తిరుగుబాటు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక విప్లవాత్మక ఘట్టం. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ పాలనలోని అన్యాయాలు, దోపిడీలు, మతపరమైన జోక్యాలు, రాజకీయ మోసాలు, ఆర్థిక దోపిడీలు కలసి ఈ తిరుగుబాటుకు బీజమయ్యాయి. సిపాయిలకు అందించిన కొత్త తుపాకీ గుళ్లలో పశువుల కొవ్వు వాడుతున్నారన్న వార్తలు మత విశ్వాసాలను దెబ్బ తీయడంతో ఆగ్రహ జ్వాలలు అంటుకున్నాయి. లార్డ్ డల్హౌసీ అమలు చేసిన 'డాక్ట్రిన్ ఆఫ్ ల్యాప్స్' విధానం వల్ల ఝాన్సీ, అవధ్, నాగ్‌పూర్ వంటి అనేక రాజ్యాలు గద్దెచ్యుతమవ్వగా స్థానిక పాలకులు అవమానితులయ్యారు. రైతులపై పెరిగిన పన్నులు, వాణిజ్య దోపిడీలు ప్రజలను ఆర్థికంగా దెబ్బతీశాయి. సైన్యంలో వివక్ష, స్థానిక సైనికుల అవమానకర పరిస్థితులు అసహనాన్ని పెంచాయి. ఈ నేపథ్యమే 1857 మే 10న మీరట్‌లో తిరుగుబాటుకు దారితీసింది. సిపాయిలు తిరుగుబాటు జెండా ఎగురవేసి ఢిల్లీ వైపు కదిలి, అక్కడికి చేరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను తమ నాయకునిగా ప్రకటించారు. ఢిల్లీ తిరుగుబాటు కేంద్రంగా మారి దేశమంతా పోరాట జ్వాలలు వ్యాపించాయి. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, నానా సాహెబ్, తాంతీయా తోపే, బేగం హజ్రత్ మహల్, కున్వర్ సింగ్ వంటి నేతలు వివిధ ప్రాంతాల్లో పోరాటానికి నాయకత్వం వహించారు.**

ఢిల్లీ ముట్టడి మూడు నెలలపాటు సాగింది. జూన్ నుండి సెప్టెంబర్ వరకు కంపెనీ సైన్యం నగరాన్ని చుట్టుముట్టి దాడులు కొనసాగించింది. పంజాబ్ నుండి తీసుకు వచ్చిన యూరోపియన్ దళాలు, నిబద్ధతగల సైనికులు, ఆధునిక తుపాకుల సహాయంతో ముట్టడి తీవ్రతరమైంది. నగరంలో ఆహారం, నీరు, ఆయుధాల కొరత తిరుగుబాటు దారులను కుంగదీసింది. అయినప్పటికీ వారు వీధి యుద్ధాలు సాగించి, కంపెనీ దళాలకు గట్టి ప్రతిఘటన ఇచ్చారు. గణాంకాల ప్రకారం ఈ ముట్టడిలో ఇరువైపులా లక్షలాది ప్రాణాలు కోల్పోయాయి. ఢిల్లీలో సుమారు నలభై వేలమంది సైనికులు, పౌరులు ప్రాణాలు విడిచారని చరిత్రకారులు అంచనా వేస్తారు.

సెప్టెంబర్ 14న కంపెనీ సైన్యం కాశ్మీరి గేట్ వద్ద గోడలను బీటలు చేసి నగరంలోకి చొరబడింది. తర్వాతి ఆరు రోజులు వీధి యుద్ధాలు సాగాయి. ప్రతి ఇంటి వద్ద తిరుగుబాటు దారులు ఎదురు దాడులు జరిపినా, చివరికి వారిని మట్టి కరిపించారు. సెప్టెంబర్ 20న ఢిల్లీ పూర్తిగా కంపెనీ ఆధీనం లోకి వచ్చింది. బహదూర్ షా జఫర్‌ను పట్టుకొని, అతని కుమారులను హతమార్చారు. అతన్ని చెరసాలలో బంధించి, తరువాత రంగూన్ తరలించారు.మొఘల్ సామ్రాజ్యపు అంతిమ అధ్యాయం అలా ముగిసింది. ఢిల్లీ పతనం తిరుగుబాటు వైఫల్యానికి సంకేతంగా నిలిచింది. అయినప్పటికీ ఈ పోరాటం దేశవ్యాప్తంగా చైతన్యాన్ని రగిలించింది. తిరుగుబాటు



విఫలమైన కారణాలు అనేకం. తిరుగుబాటు దారులలో ఐక్యత లేకపోవడం, సమన్వయ లోపాలు, ఆధునిక ఆయుధాల కొరత, సైనిక శిక్షణలో లోపాలు, కొంతమంది స్థానిక రాజులు కంపెనీకి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు తిరుగుబాటును దెబ్బతీశాయి. కానీ విఫలమైనా ఈ పోరాటం భారత జాతి చరిత్రలో ఒక మలుపు.

1857 తిరుగుబాటు తరువాత 1858లో తూర్పు ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసి, భారతదేశం నేరుగా బ్రిటిష్ కిరీటం ఆధీనంలోకి వెళ్లింది. పాలనా విధానాలలో మార్పులు చేశారు. భారతీయులలో జాతీయ చైతన్యం పెరిగింది. తిరుగుబాటు వీరుల త్యాగాలు తర్వాతి శతాబ్దం పాటు సాగిన స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచాయి. ఝాన్సీ రాణి వీరత్వం, సిపాయిల ధైర్యం, బహదూర్ షా జఫర్ ఆవేదన, నానా సాహెబ్ పోరాటం అన్నీ భారతీయుల మదిలో శాశ్వతంగా ముద్రించాయి.

సెప్టెంబర్ 20, 1857 ఢిల్లీ పతనం ఒక తిరుగుబాటు ముగింపు మాత్రమే కాదు, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి బలమైన పునాదిగా నిలిచిన చారిత్రక ఘట్టం. దాస్యపు సంకెళ్ళను తెంచుకునే ప్రయత్నం మొదలైన రోజు అదే. ప్రాణత్యాగాలు, రక్తసిక్త వీధులు, విఫలమైన ఆశయాలు అన్నీ కలసి తరువాతి తరాలకు స్వేచ్ఛా వాంఛను నింపాయి. ఈ పోరాటం భారతీయులలో జాతీయం అనే భావనను మేల్కొలిపి, "స్వాతంత్ర్యం" అనే మహత్తర లక్ష్యానికి మార్గదర్శకంగా నిలిచింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# చెదరని ధర్మపురి.. తరగని వైభవం

## శిథిలాల నుంచి శిఖరాల దాకా పునరుజ్జీవన గాథ • శతాబ్దాల దాడులు, విధ్వంసాలను తట్టుకుని నిలిచిన పుణ్యక్షేత్రం ధర్మపురి

పుణ్యవాహిని గోదావరి నదీమతల్లి దక్షిణ వాహినియై పరమపావనంగా విలసిల్లే కరీంనగర్ సీమలోని ధర్మపురి క్షేత్రం తెలంగాణ ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక ముఖచిత్రంలో ఒక సమున్నత శిఖరం. శైవ, వైష్ణవ సంప్రదాయాల సమన్వయ క్షేత్రంగా, వేదనాదాలు, శిల్పకళా శోభతో ప్రసిద్ధి చెందిన ఈ ధామం శతాబ్దాలుగా భాసిల్లుతోంది. ధర్మపురి శేషప్ప కవి తన శతకంలో "భూషణ వికాస శ్రీ ధర్మపురి నివాస" అంటూ కీర్తించిన ఈ పవిత్ర క్షేత్రం, కేవలం ఆధ్యాత్మికతకే కాక దక్కన్ పీఠభూమిలో సాగిన దండయాత్రలు, ఆలయ విధ్వంసాలు మరియు వాటిని అధిగమించి సాధించిన పునర్నిర్మాణాలకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది.

### చారిత్రక దాడులు - దెబ్బతిన్న ప్రాచీన ఆలయాలు

క్రీస్తుశకం 1303లో అల్లావుద్దీన్ ఖిల్జీ సైన్యాధ్యక్షుడు మాలిక్ కాఫూర్ ఓరుగల్లుపై సాగించిన దండయాత్ర సమయంలో, ధర్మపురిలోని అత్యంత ప్రాచీనమైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలు తీవ్ర ధ్వంసకాండకు గురయ్యాయి. అనంతరం బహమనీ సుల్తాన్ల పాలనలో (క్రీ.శ. 1362-63 మరియు 1434-35 నాటి పరిణామాలు) కూడా ఈ క్షేత్రం పలుమార్లు దాడులను ఎదుర్కొంది. ఆ సమయాల్లో భక్తులు తమ ప్రాణాలకు తెగించి స్వామివారి విగ్రహాలను, ప్రాకారాలను గోదావరి గర్భంలోనూ, సురక్షిత ప్రాంతాల్లోనూ దాచిపెట్టి కాపాడుకున్నారు.

### ఔరంగజేబు కాలం నాటి నల్లని అధ్యాయం

గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యాన్ని మొఘలులు వశం





చేసుకున్న తర్వాత, క్రీస్తుశకం 1687లో హైదరాబాద్ సుబేదార్ రుస్తుం దిల్ ఖాన్ ఆదేశాల మేరకు ధర్మపురిలోని ప్రాచీన అరవై స్తంభాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమూలంగా ధ్వంసం చేయబడింది. క్రీ.శ. 1693 నాటికి ఆ స్థానంలో మసీదు నిర్మాణం జరిగినట్లు నాటి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇంతటి పెను విధ్వంసం జరిగినప్పటికీ, రామభద్రాశ్రమానికి చెందిన నారాయణ దీక్షితులు 'నారాయణపురం' పేరిట ధార్మిక ఆవాసాన్ని నెలకొల్పి, వేదపాఠశాలలు మరియు నిత్యాగ్నిహోత్రాలను కొనసాగిస్తూ ఆధ్యాత్మిక జ్ఞానజ్యోతి ఆరిపోకుండా కాపాడారు.

### పునర్నిర్మాణ శకం - అసఫ్‌జాహీల కాలంలో పూర్వవైభవం

అసఫ్‌జాహీ రాజవంశం స్థిరపడిన తర్వాత (క్రీ.శ. 1724 - 1750 మధ్యకాలంలో), స్థానిక జమీందారులు, పండితులు మరియు భక్తులు ఏకమై నూతన ప్రాకారాలతో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి పాత ఆలయాన్ని పునరుద్ధరించారు. నిత్య ధూపదీప నైవేద్యాలు, బ్రహ్మోత్సవాలు, రథోత్సవాలను పూర్వవైభవంతో పునఃప్రతిష్ఠించారు. అయితే, క్రీ.శ. 1858లో నిజాం అఫ్జల్ ఉద్దౌలా పాలనా కాలంలో రోహిల్లా సాయుధ ముఠాలు ధర్మపురిపై దాడి చేసి దేవాలయాలను కొల్లగొట్టాయి. ఆ దాడి ముగిసిన వెంటనే ప్రజలు అధైర్యపడకుండా పుష్య బహుళ ఏకాదశి నాడు సంప్రోక్షణ, మహాశాంతి హోమాలు నిర్వహించి దైవశక్తిని పునరుద్ధరించుకున్నారు.

### తరగని ధర్మపురి వైభవం

ధర్మపురి చరిత్ర కేవలం దాడుల వికృత రూపం మాత్రమే కాదు; వాటన్నింటినీ అధిగమించిన భక్తుల అజేయమైన పునర్నిర్మాణ సంకల్పం. విదేశీ దండయాత్రలు శిల్పాలను ఖండించగలిగాయే తప్ప, ప్రజల గుండెల్లో ఉన్న నరసింహుని భక్తిని తుడిచిపెట్టలేకపోయాయి. నేడు ధర్మపురిలో చేపడుతున్న సంరక్షణ చర్యలు, కాకతీయ మరియు కళ్యాణి చాళుక్యుల శిల్పకళా ఖండాలు, ప్రాచీన శిలాశాసనాల భద్రత భావితరాల జాతి చైతన్యానికి నిరంతర దీపస్తంభమై దిశానిర్దేశం చేస్తాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# డిసెంబరులో ఐపీఎల్ 2027 మినీ వేలం

**ముంబై సెప్టెంబరు 19 :**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ మినీ వేలానికి సంబంధించి కీలక అప్‌డేట్ వెలువడింది. క్రిక్ఇన్ఫో కథనం ప్రకారం, ఈ మినీ వేలం డిసెంబర్ రెండో వారంలో (డిసెంబర్ 7 నుండి 13 మధ్య) జరిగే అవకాశం ఉంది. గత మూడు సీజన్లుగా దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో జరిగిన ఈ వేలం, ఈసారి మళ్లీ భారత గడ్డపైనే నిర్వహించేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత సైకిల్‌లో జరగబోయే ఆఖరి మినీ వేలం ఇదే కావడం విశేషం. వేలం వేదిక ఎంపికపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ.. డిసెంబర్ నెలలో దేశవ్యాప్తంగా వివాహాల సీజన్ ఎక్కువగా ఉండటం వల్ల 10 ఫ్రాంచైజీలకు కావలసిన వందకు పైగా హోటల్ గదుల లభ్యత ఆధారంగా తుది నగరం, షెడ్యూల్‌ను ఖరారు చేస్తామని తెలిపారు. ఈ మినీ వేలంలో జట్లు తమ పాత ఆటగాళ్లను చాలావరకు అట్టేపెట్టుకునే అవకాశం ఉంది. 2027 సీజన్ కోసం ప్రతి ఫ్రాంచైజీ బేస్‌లైన్ పర్స్ విలువ రూ. 120 కోట్లు కాగా, మొత్తం సాలరీ క్యాప్‌ను రూ. 157 కోట్లుగా నిర్ణయించారు. ఇక మ్యాచ్‌లో ఉపయోగించే వివాదాస్పద 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన కొనసాగింపుపై గవర్నింగ్ కౌన్సిల్ త్వరలోనే సమీక్షించనుంది.




# పుజారానే తాను ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బ్యాటర్

## ప్యాట్ కమిన్స్

మెల్‌బోర్న్ సెప్టెంబరు 19 :
భారత క్రికెట్‌లో తాను ఎదుర్కొన్న అత్యంత కఠినమైన బ్యాటర్ విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ కాదని, మాజీ టెస్ట్ బ్యాటర్ చతేశ్వర్ పుజారానే అని ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెల్లడించాడు. ఇటీవల 'ప్రైమ్ వీడియో స్పోర్ట్' ఇంటర్వ్యూలో వివిధ దేశాలకు చెందిన కఠినమైన బ్యాటర్ల గురించి మాట్లాడిన కమిన్స్, భారత్ తరఫున పుజారా పేరును ఎంపిక చేశాడు. పుజారాను వికెట్ తీయడం చాలా కష్టమని, అతనికి బౌలింగ్ చేయడం 'చిన్న చిన్న దెబ్బలతో క్రమంగా చావగొట్టినట్లు' ఉంటుందని కమిన్స్ సరదాగా వ్యాఖ్యానించాడు. వికెట్ కాపాడుకోవడం కోసం పుజారా 100 డాట్ బాల్స్ ఆడేందుకైనా వెనుకాడడని, బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వడని కొనియాడాడు. ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన 2018-19, 2020-21 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ విజయాల్లో పుజారా ఓపికైన బ్యాటింగ్ కీలక పాత్ర పోషించింది. ఇతర దేశాల నుంచి సయీద్ అజ్మల్, అలిస్టర్ కుక్, ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెకల్లమ్, తిలకరత్నే దిల్షాన్, క్రిస్ గేల్ పేర్లను కమిన్స్ ప్రస్తావించాడు. కాగా, కమిన్స్ ఎంచుకున్న జాబితాలో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఆటగాళ్లే ఉండటం విశేషం. 103 టెస్టుల్లో 7,195 పరుగులు చేసిన పుజారా 2025లో రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.






# భారత్‌తో టీ20 సిరీస్‌కు రచిన్ దూరం?

**ఆక్లాండ్, సెప్టెంబరు 19 :**
టీమిండియాతో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. ఆక్లాండ్‌లో ఓ వాణిజ్య ప్రకటన షూటింగ్‌లో డైవింగ్ క్యాచ్ ప్రయత్నించిన సమయంలో కిందపడటంతో అతడి కుడి భుజానికి గాయమైంది. బుధవారం జరిగిన షూటింగ్‌లో సేఫ్టీ మ్యాట్‌పై అదుపుతప్పి పడటంతో రచిన్ భుజం స్థానభ్రంశం చెందినట్లు సమాచారం. అయితే శుక్రవారం వైద్యులు పరీక్షించిన అనంతరం భుజంలో తీవ్రమైన నిర్మాణాత్మక నష్టం ఏమీ లేదని నిర్ధారించారు. అయినప్పటికీ పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాల పాటు పునరావాసం అవసరమని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. ఈ ఘటనపై న్యూజిలాండ్ ప్రదర్శన నిర్వహణ విభాగం స్పందిస్తూ.. రచిన్ త్వరగా కోలుకోవడమే తమ ప్రాధాన్యమని పేర్కొంది. భద్రతా ప్రమాణాలు పాటించినప్పటికీ అనుకోకుండా ఈ ప్రమాదం జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తమ విధానాలను సమీక్షిస్తామని వెల్లడించింది. అక్టోబరు 22 నుంచి భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. మరో వారం రోజుల్లో న్యూజిలాండ్ జట్టును ప్రకటించే అవకాశం ఉంది. రాబోయే ఆరు నెలల్లో కీలక టెస్టు సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో రచిన్‌ను తొందరగా బరిలోకి దించబోమని ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ స్పష్టం చేశారు. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే పోటీ క్రికెట్‌లోకి తీసుకురావాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. వైట్‌బాల్ క్రికెట్‌లో న్యూజిలాండ్‌కు కీలక ఆటగాడిగా మారిన రచిన్ రవీంద్ర ఇప్పటివరకు 52 టీ20 మ్యాచ్‌ల్లో 759 పరుగులు చేయడంతో పాటు 26 వికెట్లు సాధించాడు. అతడు అందుబాటులో లేకపోతే మిచెల్ శాంట్నర్‌పై అదనపు బాధ్యతలు పడే అవకాశం ఉంది.






# జైస్వాల్‌కు వన్డేల్లో మరిన్ని అవకాశాలు ఇవ్వాలి

## ఇర్ఫాన్ పఠాన్

**న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :**
వెస్టిండీస్‌తో సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి జైస్వాల్ తగినంత మ్యాచ్ అనుభవం సాధించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించాడు. ప్రస్తుతం భారత వన్డే జట్టులో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ తర్వాత జైస్వాల్ మూడో ఓపెనర్‌గా (బ్యాకప్ ఓపెనర్) ఉన్నాడని పఠాన్ గుర్తుచేశాడు. ఇప్పటివరకు ఆడిన ఆరు వన్డేల్లోనే రెండు సెంచరీలు సాధించిన జైస్వాల్‌ను ప్రపంచకప్‌కు ముందు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నాడు. ప్రపంచకప్‌నకు ముందు భారత్ మరో 11 వన్డేలు ఆడనుందని, ఈ క్రమంలో బెంచ్ బలాన్ని పరీక్షించడం ఎంతో ముఖ్యమని తెలిపాడు. ఇక ఆసియా క్రీడలు, వెస్టిండీస్ సిరీస్ ఒకే సమయంలో రావడం వల్ల నితీశ్ కుమార్ రెడ్డి, ఆకిబ్ నబీ, నమన్ ధీర్, ధ్రువ్ జురెల్ వంటి యువ ఆటగాళ్లకు తమ సత్తా చాటేందుకు మంచి అవకాశం దక్కిందని పఠాన్ పేర్కొన్నాడు.

# నాగోయా పయనానికి ముందే టీమిండియాకు కిట్ కష్టాలు

**న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :**
ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు భారత పురుషుల క్రికెట్ జట్టు ఆదివారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి జపాన్‌లోని నాగోయాకు బయలుదేరనుంది. అయితే ప్రయాణానికి ముందే జట్టుకు కిట్ సమస్యలు ఎదురయ్యాయి. కొందరు ఆటగాళ్లకు సరైన పరిమాణంలో అధికారిక క్రీడా దుస్తులు ఇంకా అందలేదని సమాచారం. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి, భారత ఒలింపిక్ సంఘం కిట్ సరఫరాదారు మధ్య పలుమార్లు చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. చాలా మంది ఆటగాళ్ల పరిమాణ సమస్యలు ఇప్పటికే పరిష్కారమయ్యాయి. మిగిలిన ఆటగాళ్లకు కూడా త్వరలోనే కిట్లు అందనున్నట్లు సమాచారం. జపాన్‌లో భారత ఆటగాళ్లు రెండు రకాల జెర్సీలు ధరించనున్నారు. సెప్టెంబరు 22న జపాన్‌తో జరిగే స్నేహపూర్వక టీ20 మ్యాచ్‌లో సాధారణ భారత జట్టు జెర్సీతో బరిలోకి దిగనుండగా.. సెప్టెంబరు 28న ప్రారంభమయ్యే ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్ నుంచి అధికారిక ఆసియా క్రీడల జెర్సీని ధరిస్తారు. కిట్ సమస్య ఇప్పటికే భారత బృందంలోని మరో అథ్లెట్‌పై ప్రభావం చూపింది. షాట్‌పుట్ క్రీడాకారుడు తజిందర్‌పాల్ సింగ్ తూర్‌కు అధికారిక దుస్తులు అందకపోవడంతో ఆసియా క్రీడల ప్రారంభోత్సవంలో భారత పురుషుల పతాకధారిగా పాల్గొనలేకపోయారు. దీంతో ఆయన స్థానంలో కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్‌ను పతాకధారిగా ఎంపిక చేశారు. మరోవైపు క్రికెట్ జట్టు బస విషయంలోనూ బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నిర్వాహకులు కేటాయించిన గదుల్లో భారీ కిట్ బ్యాగులను ఉంచేందుకు తగినంత స్థలం లేకపోవడంతో వాటి కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేసినట్లు సమాచారం. మహిళల క్రికెట్ జట్టు మాత్రం భారత ఒలింపిక్ సంఘం ఏర్పాటు చేసిన వసతిలోనే బస చేయనుంది. పురుషుల క్రికెట్‌లో భారత్‌కు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభించింది. సెప్టెంబరు 28న గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచే జట్టుతో భారత్ తలపడనుంది. సెప్టెంబరు 22న జపాన్‌తో స్నేహపూర్వక మ్యాచ్ ముగిసిన అనంతరం భారత జట్టు పూర్తిగా ఆసియా క్రీడల పోరుపైనే దృష్టి పెట్టనుంది.




# రోహిత్, కోహ్లీ నుంచి పరుగులే ఆశిస్తున్నాం



## ఆకాశ్ చోప్రా

**న్యూఢిల్లీ సెప్టెంబరు 19 :**
2027 వన్డే ప్రపంచకప్‌కు మరో ఏడాది మాత్రమే సమయం ఉన్నందున, సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల నుంచి ప్రధానంగా పరుగులు మాత్రమే ఆశిస్తున్నామని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. వెస్టిండీస్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఎంపికైన నేపథ్యంలో ఆకాశ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. వీరు ఫామ్‌లో ఉంటే ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించగలరని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేసిన 15 మంది సభ్యుల భారత జట్టుపై చోప్రా సంతృప్తి వ్యక్తం చేశాడు. రిషబ్ పంత్ స్థానంలో రెండో వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని కొనియాడాడు. హార్దిక్ పాండ్యా అందుబాటులో లేని సమయంలో నితీశ్ కుమార్ రెడ్డిని తీసుకోవడం జట్టుకు కలిసివస్తుందన్నాడు. ఇక ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌ల మధ్య తీవ్ర పోటీ ఉందని, 2027 ప్రపంచకప్ నాటికి ఈ ముగ్గురిలో ఒకరికే అవకాశం దక్కవచ్చని అంచనా వేశాడు. కాగా, భారత జట్టు సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో తొలి వన్డే ఆడనుంది. ఆ తర్వాత రెండవ మ్యాచ్ సెప్టెంబర్ 30న గువాహటిలో, మూడవ వన్డే అక్టోబర్ 3న చండీగఢ్‌లో జరగనున్నాయి.



## మళ్లీ పట్టాలెక్కనున్న 'ది ఇంటర్న్' రీమేక్

అమితాబ్ బచ్చన్, దీపికా పడుకోన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కనున్న 'ది ఇంటర్న్' హిందీ రీమేక్ మళ్లీ పట్టాలెక్కనుంది. అమెరికన్ కామెడీ డ్రామాకు రీమేక్‌గా ఈ చిత్రాన్ని రూపొందించేందుకు గత ఐదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలోనే అమితాబ్, దీపిక ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు ప్రకటన వచ్చినప్పటికీ, అనివార్య కారణాలతో ప్రాజెక్ట్ నిలిచిపోయింది. తాజాగా ఈ సినిమాను తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నాలు మొదలైనట్లు సమాచారం. అమిత్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. 'పీకూ' తర్వాత అమితాబ్ బచ్చన్, దీపికా పడుకోన్ మరోసారి కలిసి నటించనుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరుగుతోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. హాలీవుడ్ చిత్రాన్ని యథాతథంగా తెరకెక్కించకుండా భారతీయ నేపథ్యానికి అనుగుణంగా కథలో పలు మార్పులు చేయనున్నట్లు దర్శకుడు ఇప్పటికే వెల్లడించారు. ఈ చిత్రాన్ని దీపికా పడుకోన్ స్వయంగా నిర్మించనున్నట్లు సమాచారం. దీంతో నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా ఆమె మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఓ యువ వ్యాపారవేత్త ఫ్యాషన్ సంస్థను నడిపించే క్రమంలో ఎదుర్కొనే సవాళ్లు, అదే సంస్థలో 70 ఏళ్ల రిటైర్డ్ వ్యక్తి సీనియర్ ఇంటర్న్‌గా చేరిన తర్వాత వారిద్దరి మధ్య ఏర్పడే వృత్తిపరమైన అనుబంధం, మానవ సంబంధాల నేపథ్యంలో 'ది ఇంటర్న్' కథ సాగుతుంది. హిందీ రీమేక్‌లో ఈ కథను భారతీయ పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా మలుస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# అందం అంటే ఆరోగ్యమే

ప్రసవానంతరం పెరిగిన బరువుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలు, శరీరాకృతిపై జరుగుతున్న వ్యాఖ్యలపై బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ స్పందించారు. తన దృష్టిలో నిజమైన అందం అంటే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటమేనని స్పష్టం చేశారు. కెరీర్ ప్రారంభంలో అందానికి సంబంధించిన కఠినమైన ప్రమాణాలను పాటించినప్పటికీ, కాలక్రమేణా తన ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చిందని తెలిపారు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడంతో పాటు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని కత్రినా పేర్కొన్నారు. బయట కనిపించే రూపం కంటే వ్యక్తిలో ఉండే ఆత్మవిశ్వాసమే అసలైన సౌందర్యమని అభిప్రాయపడ్డారు. అందం విషయంలో ఇతరులు నిర్ణయించే ప్రమాణాల కంటే, మన గురించి మనం ఎలా భావిస్తున్నామన్నదే ముఖ్యమని చెప్పారు. ఇదిలా ఉండగా, కత్రినాపై జరుగుతున్న ట్రోలింగ్, బాడీ షేమింగ్ వ్యాఖ్యలను పలువురు సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ కూడా దీనిపై స్పందించారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో హార్మోన్ల మార్పులు చోటుచేసుకోవడం సహజమైన ప్రక్రియ అని ఆమె పేర్కొన్నారు. మహిళల శారీరక మార్పులను అర్థం చేసుకోకుండా హేళన చేయడం సరికాదని ఖుష్బూ అన్నారు. తాను కూడా గతంలో ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. ఇతరుల వ్యాఖ్యలను పట్టించుకోకుండా మహిళలు తమను తాము ప్రేమించుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడమే బాడీ షేమింగ్‌కు సరైన సమాధానమని ఆమె పేర్కొన్నారు.



## 'వెట్టువం' కోసం శోభిత కఠిన శిక్షణ

**హైదరాబాద్, సెప్టెంబరు 19 :**
అక్కినేని నాగ చైతన్య భార్య, నటి శోభిత ధూళిపాళ్ల ప్రస్తుతం దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న 'వెట్టువం' సినిమాలో శారీరకంగా ఎంతో కఠినమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆమె చూపిస్తున్న అంకితభావాన్ని దర్శకుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. శోభిత అద్భుతమైన నటి అని పేర్కొన్న ఆయన.. ఆమెతో చాలా కాలంగా కలిసి పనిచేయాలని అనుకుంటున్నానని తెలిపారు. సినిమాలోని యాక్షన్ సన్నివేశాల్లో శోభిత ఒక్క షాట్‌కు కూడా డూప్‌ను ఉపయోగించలేదని పా. రంజిత్ వెల్లడించారు. కెమెరా రిహార్సల్స్ సమయంలో మాత్రమే స్టంట్ డబుల్స్ ఉండేవారని, తుది చిత్రీకరణలో మాత్రం శోభిత స్వయంగా అన్ని సన్నివేశాలను చేసేవారని చెప్పారు. పాత్రలో సహజత్వం రావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఆమె తన వంద శాతం కష్టపడ్డారని రంజిత్ తెలిపారు. మరోవైపు, 'వెట్టువం' కోసం తాను ఎంతో కష్టపడుతున్నట్లు శోభిత కూడా వెల్లడించారు. సినిమాలోని కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేయడానికి 15 నుంచి 20 ఏళ్ల శిక్షణ అవసరమయ్యేంత క్లిష్టంగా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ ప్రతి షూటింగ్ రోజూ ఉత్సాహంతో, బృందంగా కలిసి స్టంట్స్ పూర్తి చేస్తున్నామని తెలిపారు. దర్శకుడి ప్రశంసలు, శోభిత చెప్పిన విషయాలను బట్టి 'వెట్టువం'లో తన పాత్రను సహజంగా, బలంగా తెరపైకి తీసుకురావడానికి ఆమె తీవ్రంగా శ్రమిస్తున్నట్లు స్పష్టమవుతోంది.






## సిద్ధార్థ్‌పై తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 19 :**
మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా దాదాపు రెండు దశాబ్దాలుగా దక్షిణాది, హిందీ చిత్రాల్లో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె.. సిద్ధార్థ్ మల్హోత్రా కథానాయకుడిగా నటిస్తున్న 'ది వ్యాన్' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం తాజాగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తన సహనటుడు సిద్ధార్థ్ మల్హోత్రాపై తమన్నా ప్రశంసలు కురిపించారు. తన సినీ ప్రయాణంలో ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి పనిచేశానని చెప్పిన ఆమె.. సిద్ధార్థ్‌లాంటి అందమైన నటుడిని ఇంతవరకు చూడలేదని అన్నారు. 'అందగాడు' అనే పదానికి సిద్ధార్థ్ నిలువెత్తు రూపమని ఆమె చేసిన వ్యాఖ్యలు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు, సినిమాలో తమన్నా, సిద్ధార్థ్ మధ్య కనిపించే జోడీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. ఈ చిత్రంలో బిహారీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఛఠ్ పూజ నేపథ్యంలో ఓ ప్రత్యేకమైన పాటను తెరకెక్కించారు. ఈ పాట గురించి మాట్లాడుతున్న సమయంలో తమన్నా తన వ్యక్తిగత అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ముంబయిలో పుట్టి పెరిగిన తనకు జుహూ బీచ్‌లో వేలాది మంది మహిళలు ఛఠ్ పూజ నిర్వహించడం చాలాసార్లు కనిపించేదని తమన్నా తెలిపారు. అయితే ఆ పూజ వెనుక ఉన్న సంప్రదాయాలు, భక్తి, ఆచారాల గురించి సినిమా చిత్రీకరణ సమయంలోనే మరింతగా తెలుసుకున్నానని చెప్పారు. ఛఠ్ పూజలో మహిళలు సుమారు 36 గంటల పాటు నీరు కూడా తీసుకోకుండా కఠినమైన నియమాలను పాటించడం తనను ఆశ్చర్యపరిచిందని పేర్కొన్నారు. బిహారీ సంస్కృతిలో ఛఠ్ పూజకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని తమన్నా అన్నారు. సాధారణంగా ఉదయించే సూర్యుడికి పూజలు చేయడం చూస్తుంటామని.. అయితే ఈ పూజలో అస్తమించే సూర్యుడికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం తనను ఆకట్టుకుందని చెప్పారు. పాట చిత్రీకరణ సమయంలో తనకు ఒక ప్రత్యేకమైన అనుభూతి కలిగిందని, తనలోకి ఏదో తెలియని దివ్యమైన శక్తి ప్రవేశించినట్టుగా అనిపించిందని తమన్నా వెల్లడించారు.



## పీరియడ్స్‌పై శ్రుతి హాసన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 19:**
నటి, గాయని శ్రుతి హాసన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ విషయాన్ని తాజాగా బహిరంగంగా వెల్లడించారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె.. పీరియడ్స్ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పంచుకున్నారు. చిన్నప్పటి నుంచే తీవ్ర నొప్పితో బాధపడేదానినని, కొన్ని సందర్భాల్లో వాంతులు, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు ఎదురయ్యేవని తెలిపారు. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని శ్రుతి చెప్పారు. షూటింగ్‌ల సమయంలో, ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటున్నప్పుడు తీవ్రమైన కడుపునొప్పి ఉన్నప్పటికీ ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయేదానినని తెలిపారు. తన సమస్యను చెప్పడం కంటే దాచుకోవడమే మంచిదని అప్పట్లో భావించేదానినని, దాంతో తాను ఎందుకు నీరసంగా కనిపిస్తున్నానో చుట్టుపక్కల వారికి అర్థం కాకపోయేదని చెప్పారు. అయితే తనతో కలిసి పనిచేసిన ఓ కళాకారుడికి శస్త్రచికిత్స జరిగిన సమయంలో చిత్రబృందం అతనికి అవసరమైన సహాయం చేయడం చూసిన తర్వాత తన ఆలోచన మారిందని శ్రుతి తెలిపారు. తన సమస్యను కూడా చిత్రబృందానికి చెబితే వారు అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందని చెప్పారు. ఆ తర్వాత ఓ దర్శకుడితో పీరియడ్స్ సమస్య గురించి చెప్పగా ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని, ఆయనకు కుమార్తె ఉండటంతో తనకు మరింత ధైర్యం వచ్చిందని వెల్లడించారు. అప్పటి నుంచి అవసరమైనప్పుడు తన సమస్య గురించి బహిరంగంగా చెప్పడం ప్రారంభించానని శ్రుతి పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఆమె మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని సరదాగా వ్యాఖ్యానించారు. అలా జరిగితే హీరోయిన్ల ఒప్పందాల్లో పీరియడ్స్‌కు సంబంధించిన సెలవులను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించేవారేమో అంటూ చమత్కరించారు. శ్రుతి హాసన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**